

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పీజీ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ఎంఆర్.అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్‌కు చెందిన ఎంఎస్‌సి స్టాటస్టిక్స్ విద్యార్థిని మౌనిక రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరాము తెలిపారు. జాతీయ స్టాటిస్టిక్స్ డేను పురస్కరించుకుని ఈ క్విజ్ నిర్వహించామన్నారు. ప్రథమ స్థానం సాధించిన మౌనికను ఆయన సత్కరించారు. అధ్యాపక సిబ్బంది ఆమెను అభినందించారు.



మౌనికను అభినందిస్తున్న నిర్వాహకులు

అల్లూరి ధైర్యం, త్యాగనిరతి స్ఫూర్తిదాయకం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర పోరాటం కోసం అలుపెరగని కృషి చేసిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్యం, త్యాగనిరతి, నిరాడంబరత తరతరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. అల్లూరి 126వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక జ్యుట్‌మిల్లు ఫ్లయ్ ఓవర్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో అల్లూరి పోరాట పటిమ, చరిత్రను సింహావలోకనం చేసుకోవడం మన కర్తవ్యమన్నారు. దేశ స్వాతంత్రోద్యమానికి తెలుగునేల అందించిన సాహస వీరుల్లో అగ్రగణ్యుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, కార్పొరేటర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు జ్యూట్‌మిల్లు సెంటర్‌లోని అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ ఆవరణలో

భారత స్వాతంత్ర పోరాటానికి అల్లూరి సీతారామరాజు ఒక మార్గదర్శిగా నిలిచారని డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి డిఆర్ఒ, అధికారులు నివాళులర్పించారు. డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే దేశం కోసం త్యాగం చేసి స్వాతంత్ర స్ఫూర్తిని రగిల్చిన వ్యక్తిగా అల్లూరి సీతారామరాజు చరిత్రలో నిలిచి పోయారన్నారు. సీతారామరాజులోని నాయకత్వ లక్షణాలను, వారి త్యాగ స్ఫూర్తిని, దేశభక్తిని ఆదర్శంగా తీసుకో వాలని కోరారు. సమావేశంలో బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, కలెక్టరేట్ ఎఒ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంత్యుత్సవాలు

ముదినేపల్లి: అల్లూరి సీతా రామరాజు జయంతి వేడుకలు మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. రాజానగరంలోని ఆయన విగ్రహానికి కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగినేని బాబ్జీ, సుబ్బరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిడమరు : అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు అన్నారు. భువనపల్లిలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. అనంతరం కోన శీనివాసరావు అధ్యక్షతన. జరిగిన సభలో రమణరావు మాట్లాడారు. ఈ సభలో గవర సత్యనారాయణ, లావేటి చంద్రరావు, ప్రగడ మణికంఠ, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: అల్లూరి త్యాగాలు చిరస్మరణీయమని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని నూతిరామన్నపాలెంలో జరిగిన అల్లూరి జయంతి వేడుకల్లో ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, ఆరేటి సత్యనారాయణ, కోవాస్ నారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు రామతులసి, ఎంపిపి కారం శాంతి, వైస్‌ఎంపిపి మోహన్‌రావు, సర్పంచి పోడియం లక్ష్మి పాల్గొన్నారు.


పోలవరం: బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని పోలవరం ప్రాజెక్టు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.విజయకుమార్ అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా పోలవరం పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న అల్లూరి విగ్రహానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.మల్లేశ్వరరావు, ఎఎస్ఐ కె.సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరావు, పురుషోత్తం పాల్గొన్నారు.


జీలుగుమిల్లి : అల్లూరి జయంతి సందర్భంగా స్థానిక తహశీల్దర్ కార్యాలయంలో తహశీల్దార్ సుందర్ సింగ్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణ, విఆర్ఒలు అశోక్, తులసి, మాధురి, జూనియర్ అసిస్టెంట్ శాంతి, విఆర్ఎ షరీఫ్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : అల్లూరి జయంతిని స్థానిక తొమ్మిదో వార్డు పర్రెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎపియుసిఎఫ్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పర్రెడ్డిగూడెం పాఠశాలలో నిర్వహించారు. ముందుగా పాఠశాల ఇన్‌ఛార్జి సాయిబాబు, ఎస్‌డబ్ల్యూఎఫ్ పట్టణ అధ్యక్షులు కెఎస్ నారాయణ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి షేక్ మాబుసుభాని, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బి.యశ్వంత్, పట్టణ పౌర సమాఖ్య పట్టణ కార్యదర్శి వంగ గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి : అల్లూరి పోరాట స్ఫూర్తి ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. భైరవపట్నంలో అల్లూరి జయంతి సందర్భంగా క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కనుమూరి వాసురాజు, శ్రీహరిరాజు, సుబ్బరాజు, విశ్వనాథరాజు, సర్పంచి నేలపాల బుజ్జి, అడుసుమిల్లి, రాజారమణ పాల్గొన్నారు.

కైకలూరు : మహనీయులు అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగా వంటి నేతల అడుగు జాడల్లో యువత నడవాలని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలో అల్లూరి, వంగవీటి జయంతులు నిర్వహించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో..


పోలవరంలో..


ముగిసిన 'పోలవరం పోరుకేక'

చిరుజల్లుల నడుమ ధర్నాచౌక్‌లో నినదించిన నిర్వాసితులు

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరు

మహాధర్నాలో నేతలు, వెల్లువెత్తిన సంఘీభావాలు


పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గతనెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక మండలం నెల్లిపాకలో ప్రారంభమైన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర మంగళవారం విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నాతో ముగిసింది. చిరుజల్లుల నడుమ ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని నినదించారు. సమస్యలు పరిష్కరించే వరకూ పాదయాత్ర స్ఫూర్తితో పోరు ఉధృతం చేస్తామని నేతలు ప్రకటించారు.


జ్ఞాపికలు అందుకుంటున్న కళాకారుల బృందం




జ్ఞాపికలు అందుకుంటున్న ఎ.రవి, మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

జగనన్న ఆణిముత్యాల సాధనకు పోటీపడాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - పెదపాడు

'జగనన్న ఆణిముత్యాలు' అవార్డు సాధనకు ప్రతి విద్యార్థీ పోటీ పడాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలం సత్యవోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించి అక్కడి విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యా ప్రగతి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంటా పద్మశ్రీ మాట్లాడుతూ పేదరికాన్ని పారదోలేది విద్య మాత్రమేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ప్రతిభ కనపరచిన విద్యాధినీ విద్యార్థులను గుర్తించి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా నగదు బహుమతిని అందించి, సత్కరిస్తున్నామన్నారు. ఈ అవార్డు సాదించేందుకు విద్యార్థులు పోటీ పడాలన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

అతిత్వరలో బాలుని ఆచూకీ కనిపెడతాం

ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



మండలంలోని దొరమామిడి సమీపంలోని సరుగుడు నిర్వాసిత కాలనీలో బాలుని అదృశ్యంపై కొంతమంది అనుమానితులను ప్రశ్నిస్తున్నామని, అతి త్వరలో బాలుని ఆచూకీ కనిపెడతామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. సరుగుడు గ్రామానికి చెందిన కొవ్వాసు వెంకటేష్, రామలక్ష్మి దంపతుల చిన్న కుమారుడు కొవ్వాసు రవితేజ (1) సోమవారం తెల్లవారుజాము నుంచి కన్పించడం లేని సంగతి తెలిసిందే. దీనిపై విచారణకు జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి మంగళవారం గ్రామానికి వచ్చారు. సరుగుడు గ్రామంలోని బాలుడి ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి బాలుడు తల్లిదండ్రులను, చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. అనంతరం ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ బాలుని అదృశ్యంపై ఎనిమిది ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయన్నారు. ఇప్పటికే కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే బాలుని ఆచూకీ కనిపెడతామని చెప్పారు. ఆమె వెంట పోలవరం డిఎస్‌పి ఎ.శ్రీనివాస్, జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు, బుట్టాయిగూడెం ఎస్ఐ వెంకన్న, తడికలపూడి ఎస్ఐ జయబాబు తదితరులు ఉన్నారు.

కొల్లేరు గ్రామాల్లో రీసర్వే వేగవంతం : కలెక్టర్


ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు గ్రామాల్లో రీసర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కొల్లేరు గ్రామాల్లో రీసర్వేపై సంబంధిత తహశీల్దార్లు, సర్వేయర్లతో జెసి బి.లావణ్యవేణితో కలిసి ఆయన సమీక్షించారు.దాదాపు వందేళ్ల తర్వాత ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే చేపట్టిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు అందరూ రీసర్వే పనులను వారికి కేటాయించిన గ్రామాల్లో నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఒఆర్ఐ (ఆర్తో రెక్టిఫైడ్ ఇమేజెస్) వచ్చిన గ్రామాల్లో వెంటనే గ్రౌండ్ ట్రూతింగ్ చేయాలన్నారు. మ్యుటేషన్‌కి ఫామ్8 నోటీసులను జారీ చేసి వాటిని పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. 13 నోటిఫికేషన్ వీలైనంత త్వరగా జారీచేయాలన్నారు. సమావేశంలో సర్వే శాఖ ఎడి వెంకటేశ్వరరావు, ఏలూరు, దెందులూరు, భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు, మండవల్లి, కైకలూరు తహశీల్దార్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

కార్మికోద్యమ నిర్మాత అల్లూరు ధన్యజీవి

ప్రజాశక్తి - ఏలూరు

సిఐటియు జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కార్మికోద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ ధన్యజీవి అని పలువురు కొనియాడారు. అల్లూరు తొమ్మిదో వర్ధంతి సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరు చిత్రపటానికి బి.సోమయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ అల్లూరు సత్యనారాయణ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సిఐటియు నిర్మాణం, అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. రైస్‌మిల్లు, బజారు జట్ల కార్మికులు, హమాలీలు, ఫ్యాక్టరీ, జ్యుట్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి, కార్మిక సంఘాల ఏర్పాటుకు నిర్విరామ కృషి చేశారన్నారు. అల్లూరు సత్యనారాయణ ఆశయాల సాధనకు కార్యకర్తలంతా నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వి.సాయిబాబా, నేతలు పి.హైమావతి, కె.విజయలక్ష్మి, కె.రామాంజనేయులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అల్లూరు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నిడమర్రు: కార్మికుల, పేదల హక్కుల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అల్లూరు సత్యనారాయణ అని పలువురు కొనియాడారు. అల్లూరు సత్యనారాయణ తొమ్మిదో వర్ధంతిని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో కోన శ్రీనివాసరావు అధ్యక్షతన. మంగళవారం నిర్వహించారు. అల్లూరు చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కంచ వరప్రసాద్, కమిలి నాని, విజ్జురోతి పాపారావు, లావేటి చంద్రరావు, మింది బాపిరాజు, కన్నాజి సాయి పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందజేయడమే లక్ష్యం

జగనన్న సురక్షలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - పెదపాడు

సంక్షేమ పథకాలను నూరుశాతం అర్హులకు అందించడమే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలం సత్యవోలులోని గంటా వెంకట కనకం పార్వతమ్మ కల్యాణ మండపంలో మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను ఆమె అందించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ అర్హతుండి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పథకాలు అందని పేదలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలో ఇల్లు లేని ప్రతి నిరుపేదకూ పక్కా గృహం అందించామన్నారు. వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ జరగని రీతిలో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సత్యవోలులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు బత్తుల రత్నకుమారి, సర్పంచి రంభ ఉమామహేశ్వరి, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు అప్పన్న ప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ గోపీ మాట్లాడగా తహశీల్దార్ విజయకుమార్‌రాజు, ఎంపిడిఒ ఎస్.నిర్మలజ్యోతి, సొసైటీ అధ్యక్షులు అక్కినేని రాజశేఖర్ పాల్గొన్నారు.


ధృవీకరణ పత్రం అందిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి : బాలరాజు

బుట్టాయగూడెం: క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తెల్లం వెంకాయమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, ఎంపిపి కారం శాంతి, వైస్‌ఎంపిపి గుగ్గులోతు మోహన్‌రావు, జిల్లా ఎస్‌టి కమిటీ అధ్యక్షులు కొవ్వాసి నారాయణరావు, ఎంపిటిసిలు కరాటం ఫణి, గాలి దుర్గారావు, సురక్ష ప్రత్యేక అధికారి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రమాదేవి, ఎంపిడిఒ వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు

జిల్లా స్థాయి సహకార అభివృద్ధి కమిటీ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు


జిల్లాలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా స్థాయి సహకార అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేటులోని గౌతమి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ మొదటి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలోని వివిధ సహకార సంఘాలను గుర్తించి, వాటి వివరాలను జాతీయ కో ఆపరేటివ్ డేటా బేస్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఉద్యోగులు సహకార సంఘాలు, డెయిరీ, ఫిషర్‌మెన్, చేనేత, హౌసింగ్, వంటి 17 రకాలైన 1058 సహకార సంఘాలున్నాయని, వాటిలో 776 సహకార సంఘాల వివరాలను జాతీయ కోఆపరేటివ్ డేటాబేస్‌లో అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన సంఘాల వివరాలను ఈ నెల ఏడో తేదీలోగా అప్‌లోడ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సహకార సంఘాలను బలోపేతం చేయడంలో భాగంగా వాటిని కామన్ సర్వీస్ సెంటర్లుగా ఏర్పాటు చేసి, పెట్రోల్ బంకుల నిర్వహణ, డెయిరీ, ఫిష్ రిటైల్ అవుట్‌లెట్ ఏర్పాటు, ప్రజలకు మొబైల్ రీఛార్జ్, వంట గ్యాస్ బుకింగ్, తదితర సేవలను ప్రజలకు అందించేలా చర్యలు చేపడతామన్నారు. దీనికిగాను కంప్యూటరైజేషన్, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జగనన్న పాల వెల్లువ పథకం కింద జిల్లాలో పాల సేకరణను 20 వేల లీటర్లకు పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాల సేకరణ ఎక్కువగా జరిగే గ్రామాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మరింత పాల సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార శాఖాధికారి ఎన్‌డి.మిల్టన్‌పాల్గొన్నారు.


చెరువు వద్ద మోహరించిన పోలీసులు

మళ్లీ తెరపైకి కానుకొల్లు చెరువు రగడ

ప్రజాశక్తి - మండవల్లి

అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టిన కానుకొల్లు చెరువు తవ్వకం మరోసారి వివాదాస్పదమైంది. ఆందోళనకారులతో పాటు పెద్దఎత్తున పోలీసులు మోహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చెరువు తవ్వకాలకు అనుమతులు లేవని సెక్షన్ 145 ప్రొసీడింగ్స్ ఇచ్చామని చెబుతూనే సమస్య పరిష్కరించే విధంగా రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి రాకపోవడం సమస్య మరింత జఠిలమైంది. దళితులు తెలిపిన వివరాల ప్రకారం కానుకొల్లు కాలనీ వెనుక అనుమతులు లేకుండా రొయ్యల చెరువు తవ్వకాలను నిలుపుదల చేయాలంటూ కాలనీకి చెందిన దళితులు 15 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో పెద్దఎత్తున పోలీసులు చెరువు వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. చెరువు తవ్వితే గ్రామం నీట మునిగిపోతుందని పర్యావరణం దెబ్బతింటుందని తాగేందుకు నీళు లేక నానా అవస్థలు పడాల్సి వస్తుందని దళితులు పోలీసులకు తెలిపారు. చెరువు తవ్వేందుకు అనుమతులు లేవని కావాలనే సత్యనారాయణ తన రాజకీయ పలుకుబడిని వినియోగించి తమపై దౌర్జన్యానికి దిగుతున్నాడని దళితులు పోలీసులకు విన్నవించుకున్నారు. దీనిపై తహశీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా సెక్షన్ 145 ప్రొసీడింగ్ ఇచ్చామన్నారు. పోలీసులు ఆ ప్రాంతానికి ఎందుకు వచ్చారో తెలియదని తెలుసుకుంటానని సమాధానమిచ్చారు. ఎస్ఐ రామకృష్ణ వివరణ కోరగా 112 ద్వారా సమాచారం అందిందని, దీంతో గొడవలు జరగకుండా సంఘటనా స్థలానికి చేరుకున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ కేసును కైకలూరు సిఐ ముందు ప్రవేశపెట్టానని తెలిపారు.


టిడిపిలో చేరుతున్న తుమ్మల దంపతులు

టిడిపిలోకి తుమ్మల

ప్రజాశక్తి – ముసునూరు

నాగార్జునసాగర్ కాలువ వేంపాడు మేజరు డిసి ఛైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు కుటుంబం తెలుగుదేశం పార్టీలో చేరింది. మండలంలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు తన భార్య మాజీ జెడ్పిటిసి సభ్యులు తుమ్మల అనిత తమ అనుచరులతో కలిసి బిజెపి నుంచి టిడిపిలో చేరారు. టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారంతా పార్టీలోకి పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోకి రావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు ఆకర్షితులై, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు, టిడిపి ఇస్తున్న హామీలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. గతంలో టిడిపిలోనే నాగార్జునసాగర్ కాలువ డిసి ఛైర్మన్‌గా తాను, జెడ్పిటిసి సభ్యులుగా అనిత ఎన్నో సేవలందించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దేవినేని దలరాం, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, మానం ఘంటేశ్వరరావు, సురేంద్ర పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి – చింతలపూడి

డెంగీతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. ఈనెల ఒకటో తేదీ నుండి 31వ తేదీ వరకూ నిర్వహించే మలేరియా మాసోత్సవం సందర్భంగా చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిగూడెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు ఎక్కువకాలం నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు పెరిగి డెంగీవ్యాధికి కారణమవుతాయన్నారు. ప్రజలు నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ అధికారులు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గతేడాది నాగిరెడ్డిగూడెంలో డెంగీ కేసులు నమోదును దృష్టిలో పెట్టుకుని సచివాలయ కార్యదర్శి పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది తరచూ గృహాల సందర్శనాలను చేసి జ్వర పీడితులను గుర్తించి తగిన వైద్య సేవలందించాలని కోరారు. అనంతరం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్‌బాబు, మలేరియా నియంత్రణ సబ్ యూనిట్ అధికారి బి.వెంకటేశ్వరరావు, హెచ్‌వి.కుమారి, హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ జవ్వుల్లా, బాలరాజు, శ్రీనివాసరావు, ఎఎన్ఎం బి.విజయనిర్మల, షర్మిల, ఆశావర్కర్లు శ్యామల, పుణ్యవతి, నాగమణి పాల్గొన్నారు.

భీమడోలు: డెంగీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పూళ్ల పిహెచ్‌సి వైద్యులు కళ్యాణి, మహేశ్వరి సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరు వరకూ కొనసాగనున్న డెంగీ మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి కిషోర్ పాల్గొన్నారు.

ఏళ్లనాటి బావి పూడ్చివేత

ప్రజాశక్తి – ముసునూరు

ముసునూరు హరిజనవాడలో ఏళ్ల తరబడి ఇబ్బందిగా ఉన్న బావిని ఎట్టకేలకు సర్పంచి కొండేటి విజయలక్ష్మి సౌజన్యంతో మంగళవారం పూడ్చివేశారు. ఎన్నో ఏళ్లుగా పాడుబడి, పాఠశాల దగ్గరలో ఉండటంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బావిని పూడ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జి.నరసింహారావు, కొండేటి బాబి, గ్రామస్తులు పర్యవేక్షించారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి – భీమడోలు

వివేకానందుని బోధనలు, ఆశయాలు అనుసరణీయమని భీమడోలుకు చెందిన స్వచ్ఛంద సంస్థ వివేకానంద యువజన సంఘం ఛైర్మన్ సుతాపల్లి ప్రసాద్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం భీమడోలులో వివేకానందుని వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ భీమడోలు శాఖపూర్వ అధ్యక్షులు టివి.ఉమామహేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్, వైసిపి ప్రముఖులు రామకృష్ణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నూజివీడు లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నూజివీడు కోర్టు వద్ద నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

మండలంలోని వేంపాడు భూ సమస్యను తక్షణం పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొల్లపల్లిలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్షలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలని కోరారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి – టి.నరసాపురం

మర్రిగూడెం పంచాయతీ పరిధిలో ఆదివాసీలు పోరాడి సాధించుకున్న భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూసాములపై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎస్.భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీ పరిధిలో సుమారు 30 సంవత్సరాల క్రితం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీలు పోరాడి సాధించుకున్న 90 ఎకరాల భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్న భూములను ఆదివాసీలు మంగళవారం ట్రాక్టర్లతో దున్నారు. ఈ సందర్భంగా భూ స్వాములపై చర్యలు తీసుకోవాలని భాస్కర్ డిమాండ్ చేశారు. నాడు పోరాడి సాధించుకున్న భూమిని ఉమ్మడి వ్యవసాయం చేయడానికి నాంది పలికినట్లు ఆయన తెలిపారు. 30 సంవత్సరాల నుండి అనేక తప్పుడు కేసులను, నిర్బంధాలను అనుభవించి సాధించుకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ సుమారు ఆరు గ్రామాల నిరుపేద గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఇది ఓర్వలేని భూస్వాములు కుట్ర చేసి జీవనాన్ని దెబ్బతీసి వెట్టి చాకిరీ చేయించుకునే పూర్వకాలపు ఆలోచనల భాగమే నేడు భూస్వాములు ఈ భూములకు తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆయన విమర్శించారు. ఈ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.కాటయ్య, తుట్టి నాగేశ్వరరావు, కె.కనకయ్య, కె.రాజులు, తుట్టి మోసి, కొక్కెర సూర్యారావు, తుట్టి జ్యోతి, సోయం లక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

అదనపు కట్నం వేధింపుల కేసులో నలుగురికి జైలు

ప్రజాశక్తి – కైకలూరు

అదనపు కట్నం వేదింపుల కేసులో నలుగురికి జరిమానా, జైలు శిక్ష పడినట్లు సిఐ రఘు తెలిపారు. మంగళవారం స్థానిక అసిస్టెంట్ సెషన్స్ జడ్జి న్యాయస్థానంలో విచారణకు వచ్చిన కేసు వివరాలను ఆయన తెలిపారు. ఆటపాక శివారు జాన్ పేటకు చెందిన పాలపర్తి మరియమ్మ అతని భర్త, అత్త, బావ కలిసి అదనపు కట్నం కోసం హింసించారని చేసిన ఫిర్యాదుపై, అప్పటి టౌన్ ఎస్ఐ షణ్ముఖ సాయి కేసు నమోదు చేశారు. కోర్టు విచారణ అనంతరం శిక్ష, జరిమానా విధించారు.

ఆదమరిస్తే అంతే..!

గజానికో గొయ్యితో ప్రమాదకరంగా మండలంలోని రోడ్లు
వర్షపు నీరు చేరి గుంతలు కనిపించని పరిస్థితి
ప్రమాదాలబారిన వాహనదారులు
పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి – ముదినేపల్లి

మండలంలోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఏ రోడ్డుపై ప్రయాణించాలన్నా ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. చాలా ప్రమాదకరంగా ఈ రోడ్ల పరిస్థితి మండలంలో ఉంది. అసలే రోడ్లన్నీ గుంతలమయం కాగా, దీనికి తోడు ప్రస్తుతం మండలంలో కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.


అధ్వానంగా ఉన్న ముదినేపల్లి ప్రధాన రహదారి

ఈ గుంతలు వాహనదారుల పాలిట ప్రాణసంకటంగా మారాయి. ముదినేపల్లి – బంటుమిల్లి రోడ్డులో, మండలంలోని వడాలి ప్రధాన సెంటర్‌లో, ఆంజనేయస్వామి గుడి వద్ద రోడ్డుపై భయంకరమైన గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి ఈ గుంతల్లోకి నీరు చేరడంతో రోడ్డు కనిపించడంలేదు. ఎక్కడ, గుంత ఉందో తెలియక వాహనదారులు తికమకపడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పరిస్థితి ఘోరంగా తయారైయింది. రోడ్డుపై దారి కనిపించక నిత్యం పదులు సంఖ్యలో ఇక్కడ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా వడాలి – చిగురుకోట వెళ్లే రోడ్డులో వడాలి జగన్నాధస్వామి గుడి సమీపంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతతో వాహనదారులు హడలిపోతున్నారు. అంతేకాక ఇక్కడ రోడ్డు కుంగిపోవడంతో ఈగుంతలో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. వర్షాలకు మూడు అడుగుల మేర ఈ గుంతలో నీరు చేరింది. దీంతో రోడ్డులో వెళ్లే వాహనదారుల పాట్లు వర్ణనాతీతంగా మారాయి. దీంతో భయపడుతున్న వాహనదారులు భారీ గుంత పక్కనే ఉన్న గ్రామ అంతర్గత సీసీ రోడ్డులో నుంచి ముందుకు వెళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద తిరిగి ప్రధాన రోడ్డుకు చేరుతున్నారు. కొత్తగా ఈ రోడ్ల మార్గంలో ప్రయాణించే జనం ఎక్కువ శాతం ప్రమాదాలకు గురౌతుండగా, నిత్యం తిరిగే ప్రజలు కూడా తరచు ఈ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. దీంతో ఈ రోడ్లపై ప్రయాణించాలంటేనే ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని దాదాపు అన్ని అర్‌అండ్‌బి,, జిల్లా పరిషత్ రోడ్లు, గ్రామాల్లోని అంతర్గత రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. మొన్నటి వరకూ రోడ్లపై ఏర్పడ్డ గుంతలు కనబడేవి గనుక గుంతలను తప్పించుకుని వాహనదారులు వెళ్లేవారు కాని ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గుంతల్లో బురదనీరు చేరడంతో కనబడక ఎక్కువ శాతం మంది గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని నరకప్రాయంగా మారిన ఈ



చిన్నపాటి వర్షానికి జలమయమైన రోడ్డు

రోడ్లకు కనీసం మరమ్మతులైన చేపట్టి ప్రజల మాన, ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు అధికారులను ముక్తకంఠంతో కోరుతున్నారు.

'జగనన్న సురక్ష' ద్వారా అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి – భీమడోలు

ప్రతి అర్హునికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు అన్నారు. ఆగడాలలంకలో సర్పంచి భలే రాంబాబు అధ్యక్షతన సురక్ష క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు పాల్గొన్నారు. అతిథులుగా స్థానిక ఎంపిటిసి, ఎంపిపి కనుమాల రామయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ ఆధ్వర్యంలో ద్విసభ్య కమిటీ నిర్వహించింది.


భీమడోలు మండలం ఆగడాలలంకలో..

మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిపక్షాలు తాము అధికారంలోకి వస్తే అవే పథకాలను వేరొక పేర్లతో అమలు చేస్తానని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. అర్హులకు పథకాలు చేరకుండా ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని అధిగమించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం కొనసాగిస్తుందని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు సంబంధిత పత్రాలను వారి ఇంటి వద్దకే తీసుకెళ్లి అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. ఎంపిపి మాట్లాడుతూ కొల్లేరు లంక గ్రామాల దాహార్తిని తీర్చేందుకు గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు శాసనసభ్యులు చేసిన కషి అభినందనీయమన్నారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామపరిధిలో తాగునీటి ఎద్దడి ఉందని, దీనికోసం ఏకైక వనరైన ఆగడాలలంక ఛానల్ ద్వారా నీరు రావాల్సి ఉందని తెలిపారు. కానీ గ్రామం ఆక్వా జోన్ లో ఉన్నందున స్థానికుల తాగునీటి అవసరాలకు మాత్రమే నీరు సరఫరా అవుతుందని ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చారు. ఆక్వా సాగుకు కొల్లేరులో నీటి లభ్యత లేని నేపథ్యంలో ఆగడాల లంక ఛానల్ ద్వారా నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సిఐ డిఆర్‌పి ప్రశాంతి, ఎఫ్‌డిఒ మంగారావు మాట్లాడారు. అనంతరం వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చిన 436 దరఖాస్తుల్లో 255 దరఖాస్తుదారులకు అవసరమైన సర్టిఫికెట్లు ఎంఎల్‌ఎ అదించారు.

చింతలపూడి : చింతంపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామకృష్ణ, తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఒ మురళీకృష్ణ, ఇఒపిఆర్‌డి విక్టర్‌ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు: సిఎం జగన్ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం సూరేపల్లి గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కుల, మత, వర్గ భేధాలు లేకుండా పథకాలు అందించడం గొప్ప విషయమన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా రాజకీయ నాయకుని ఇంటికి పలుమార్లు తిరిగి విసుగుచెంది ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేడు 50 ఇళ్లకు వాలంటీర్లతో ప్రతీపథకం గ్రామ సచివాలయాల ద్వారా తమ ఇంటి వద్దకే వచ్చేలా చేసిన ఘనులు జగన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్‌ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్‌ఎంపిపి-2 పాముల గంగాధరరావు, మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరావు, సర్పంచి పేరం కృష్ణ, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

చాట్రాయి: జగనన్న సురక్ష కార్యక్రమం మండలకేంద్రమైన చనుబండలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచి విస్సంపల్లి జ్యోతి, ఎంపిటిసి సోని ఆనంద్, ఇఒపిఆర్‌డి నాగరాజు, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, ఎంపిడిఒ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జన సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం పి.అంకంపాలెంలో నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న అమ్మ ఒడి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి మంజూరైన రూ.3కోట్ల 66 లక్షల 21వేల డెమో చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, ఎంపిటిసి సున్నం సురేష్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని రావిచర్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి బసవరాజు నగేష్‌రావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగన్ పరిపాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

మండవల్లి: జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు సూచించారు. చింతపాడులో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంఎల్‌ఎ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ముందర విజయనిర్మల, సర్పంచి ఘంటసాల భాగ్యలక్ష్మి, ఉపసర్పంచి మోరు రమణ, ఎంపిటిసి జయమంగళ లక్ష్మి, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బలే నాగరాజు, మోరు శీను, ముంగర ఏడుకొండలు, రామ్మోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : పూర్తిస్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కె.జగ్గవరం సొసైటీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు అన్నారు. మండలంలోని బందంచర్లలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంపిడిఒ మంగాకుమారి, వైసిపి మండల కన్వీనర్ శ్రీనురాజు, సర్పంచి గుండె వెంకటేశ్వరరావు, ఉమ్మడి తేజ, పొదిల రామారావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. అల్లూరు గ్రామ సచివాలయ వద్ద జగనన్న సురక్ష సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ, ఎంపిటిసి రెడ్డి సతీష్‌బాబు, తాడంకి రాజేష్, గంటా కోటేశ్వరరావు, అల్లాభక్షు పాల్గొన్నారు.

6న కలెక్టరేట్ వద్ద ఎఐవైఎఫ్ ధర్నా

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఆరో తేదీన కలెక్టరేట్ వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ చాకిరి సురేష్, కో కన్వీనర్ తొర్లపాటి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్, రాజు మాట్లాడారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి – చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యుల సేవలు అభినందనీయమని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాంతారావు అన్నారు. ఆసుపత్రిలో ఎన్నోరకాల సేవలందించిన వైద్యులు రసూల్, సీనియర్ నర్సు సుజాత బదిలీ అయిన సందర్భంగా వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఆసుపత్రిలో మెరుగైన సేవలం దుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు పాల్గొన్నారు.

వికలాంగుల ఉపకరణాల అందజేతకు నేడు రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి – పోలవరం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల ఐదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు వికలాంగుల ఉపకరణలు, సహాయక పరికరాల అందజేతకు ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరికరాలు కావాల్సిన వారు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపిడిఒ సూచించారు.


ఆదర్శప్రాయులు కొమరయ్య

బుట్టాయగూడెం: సాయుధ రైతాంగ పోరాట యోధులు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, భూమికోసం భుక్తి కోసం ప్రాణాలర్పించిన దొడ్డి కొమరయ్య ఆదర్శప్రాయులని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మల సురేష్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎస్.రామ్మోహన్ అన్నారు. కొమరయ్య వర్ధంతి సభ మండలంలోని దొరమామిడి గ్రామంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రామ నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు వెట్టి భారతి, పివైఎల్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి – భీమడోలు

వంగవీటి మోహనరంగ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ,పేదల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక సంతపేటలో రంగా జయంతిని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాసుబాబు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముదినేపల్లి : మండలంలోని పలుగ్రామాల్లో వంగవీటి రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్‌లో ఉన్న రంగా విగ్రహానికి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య , వైసిపి నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, కె.విష్ణువర్ధన్, అల్లాభక్షు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వాడవల్లి, నారాయణపురం గ్రామాల్లో కైకలూరు కాపు జెఎసి సంఘం కన్వీనర్ గునుకుల నారాయణ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల సర్పంచులు రమణ, దూసనపూడి అవతారం, జెఎసి మండల కన్వీనర్ సూదాబత్తుల వెంకటేశ్వరరావు, కలిదిండి మండల అధ్యక్షులు రాము పాల్గొన్నారు.

టి.నరసాపురం : వంగవీటి జయంతిని పురస్కరించుకుని మండలంలోని కాపు సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నపువారి గూడెం, రుద్రకోటరాజుగూడెం, మక్కినవారిగూడెం గ్రామాల్లో కాపునేతలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఆయా గ్రామాల్లోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాధనాల నరసింహారావు, నోముల సత్యనారాయణ, తమ్మిశెట్టి బ్రహ్మయ్య, నోముల రెడ్డియ్య, మేకల నారాయణరావు, రామారావు, జెసిబి శ్రీను పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని పెద్దగాంధీ బొమ్మ సెంటర్ వద్ద వంగవీటి జయంతిని ఘనంగా నిర్వహించారు. భారీ కేకును ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కట్ చేసి అభిమానులకు పంచారు.

మండవల్లి : మోహన్ రంగ జయంతిని పురస్కరించుకుని స్థానిక చెరువు సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ చిట్టిబాబు, బోయిడి సురేష్, వర్రీ హనుమాన్ ప్రసాద్, గుడివాడ తంబి స్వామి, గాదే రాజారావు, గుడివాడ ప్రసాద్, గుడివాడ మురళీ, వెనశెట్టి మెహర్ కుమార్, గుడివాడ బాలాజీ పాల్గొన్నారు.

పోలవరం : వంగవీటి మోహనరంగ జయంతి సందర్భంగా పోలవరం పంచాయతీ నూతనగూడెంలోని రంగా విగ్రహానికి గూటాల, పట్టిసీమ, కొత్త పట్టిసీమ, పోలవరం పంచాయతీల కాపు నాయకులు, యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గూటాల నుండి పోలవరం వరకూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరిబండి నాగరాజు, కామిశెట్టి నాగరాజు, చీకట్ల సాయికృష్ణ పాల్గొన్నారు.

కలిదిండి : కోరుకొల్లులో వంగవీటి రంగ జయంతి సందర్భంగా రంగా యూత్ ఆధ్వర్యంలో 1500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం ఆవకూరు నుండి సానారుద్రవరం, పడమటిపాలెం మీదుగా కలిదిండి వరరూ యువత బైక్ ర్యాలీ నిర్వహించింది. కోరుకొల్లు, సానారుద్రవరం, కలిదిండిలోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బాణాసంచా కాల్చారు. రంగా యూత్ సాయి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలవరం విఆర్‌ఒగా దత్తు

ప్రజాశక్తి – పోలవరం

పోలవరం విఆర్‌ఒగా దత్తు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జంగారెడ్డిగూడెం విఆర్‌ఒగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

